క్లుప్తంగా

పిడుగురాళ్లల్లో భారీ వర్షం



పిడుగురాళ్ల: పట్టణంలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం వరకు వర్షం పడింది. ఉదయం సమయంలో ఎండ తీవ్రంగా ఉండగా, మధ్యాహ్న సమయంలో ఉక్కపోత ఉండి మధ్యాహ్న 1.30 గంట నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీంతో కట్టెల అడితీల సెంటర్, అన్నా క్యాంటీన్, అదే విధంగా లోతట్టు ప్రాంతాలన్నీ నీటిలో నిండిపోయాయి. రైతులు ఈ వర్షం నష్ట కలిగిస్తుందని తెలుపుతున్నారు. ప్రత్తి పంట తీసే దశలో ఉందని, పూత రాలిపోవచ్చునని, పత్తి తీయటానికి ఇబ్బందిగా మారే అవకాశం ఉందని పత్తి రైతులు చెబుతున్నారు. అదే విధంగా మిరప రైతులు ఈ పంట వలన నీరు నిలబడిపోయి తెగుళ్లు వ్యాప్తి చెందే అవకాశం ఉందని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

గురజాలలో..

గురజాల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శనివారం మధ్యాహ్నం గురజాలలో వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది.

నర్సింగ్ విద్యార్థులు అంకిత భావంతో పనిచేయాలి

ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ జయకరుణ



నరసరావుపేట రూరల్: నర్సింగ్ వృత్తిలోకి ప్రవేశించే విద్యార్థులు శ్రద్ధ, అంకితభావం, సేవాభావం కలిగి ఉండాలని నరసరావుపేట ఏరియా హాస్పిటల్ సూపరిటెండెంట్ మేరుగ జయకరుణ తెలిపారు. కృష్ణవేణి నర్సింగ్ కళాశాలలో శనివారం లాంప్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఏరియా హాస్పిటల సూపరింటెండెంట్ జయకరుణ, ఏరియా హాస్పిటల్ హెడ్‌నర్స్ విజయకుమారిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని తెలిపారు. వైద్యులు తరువాత ఈ వృత్తిలో నర్సులకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ధనిక, పేద సంభందం లేకుండా అందరికీ సమానమైన సేవలు అందించాలని తెలిపారు. రోగులకు మనోధైర్యాన్ని నింపడంతో పాటు జబ్బులను నయం చేసే కీలకపాత్ర నర్సులందని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నూతలపాటి జోష్న, కందుల ఉదయలక్ష్మి, మౌనిక, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాదినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట రూరల్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో 8వ ఉచిత యోగ శిక్షణా శిబిరం ఈనెల 15వ తేదీ నుంచి రావిపాడు రోడ్డు ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు నందనయోగి జల్లి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 రోజుల పాటు శిక్షణా తరగతులు జరుగుతాయని, 8 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు జరిగే యోగ శిక్షణలో 42 రకాల ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానముద్రలు, ఆరోగ్యసూత్రాలు, అధ్యాత్మిక ఉపదేశం అంశాలు ఉంటాయని వివరించారు.

దోమల నివారణకు చర్యలు

రొంపిచర్ల: దోమల నిర్మూలనకు పరసరాల పరిశుభ్రతతో పాటు మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవడమే మార్గమని మండల వైద్యాధికారి డాక్టర్ పి. జగన్ నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని మునుమాక గ్రామంలో దోమల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం రొంపిచర్ల ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమలు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో లార్విక్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. గ్రామస్తులకు దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలే దోమల పెరుగుదలకు దోహదపడతాయన్నారు.

పేరుకే 24 గంటల ఆస్పత్రి..

వైద్యం అందితే ఒట్టు..



కారెంపూడి పీహెచ్‌సీ

- అన్నీ ఉన్నా రోగులకు తప్పని తిప్పలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అవస్థలు పడుతున్న పేద ప్రజలు

కారెంపూడి: పేరుకు 24 గంటలు కాన్పుల ఆస్పత్రి. తీరా అక్కడకు వెళ్తే అక్కడ అలాంటిదేమీ ఉండదు. అంబులెన్స్‌ను రప్పించి నరసరావుపేట పంపిస్తారు. ఇక్కడ చేయించే కాన్పులు వేళ్లమీద లెక్కించవచ్చు. మొదటి కాన్పు అయితే అసలే అడ్మిట్ చేసుకోరు. ఇద్దరు పిల్లలు చాలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుందామంటే ఇక్కడ చేసే వారు లేరు. ఇదీ పేద ప్రజలు ఎదుర్కొంటున్న దుస్థితి.

రెండు పీహెచ్‌సీలున్నా...

మండలంలోని రెండు పీహెచ్‌సీలలో నలుగురు డాక్టర్లు, 16 మంది ఏఎన్ఎంలు, 14 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరుగురు సూపర్ వైజర్లు, ల్యాబ్ టెక్నిషియన్స్.ఫార్మసిస్టులు, ఇతర సిబ్బంది మరో 50 మంది దాకా ఆశ వర్కర్లున్నారు. పైగా ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లున్నాయి. ఇంత పెద్ద నెట్‌వర్క్ ఏర్పాటై ఉంది. కాని అత్యవసర సేవలు అందడం లేదు. ఆస్పత్రికి వెళ్తే డాక్టర్లు మందులు రాయడం వాటిని పంపిణీ చేయడమే ఒక్కటే పీహెచ్‌సీల విధిగా కన్పిస్తోంది. రోజుకు సగటున ఒక్కో పీహెచ్‌సీకి 80 మంది దాకా వస్తున్నారు. జలుబు దగ్గు జ్వరం ఇలా చిన్న చిన్న జబ్బులకు డాక్టర్లు మందులు రాయడం మాత్రమే చేస్తున్నారు, అత్యవసర సేవలందించాలనే లక్ష్యంతోనే పీహెచ్‌సీలు 24 గంటలు అందుబాటులో ఉండాలనే లక్ష్యానికి అన్నీ ఉండి సేవలు లేని పరిస్థితి ఇబ్బందిగా మారింది. ఇక ఆయుష్ వైద్య సేవలైతే కొండెక్కాయి. ఎప్పుడూ ఆ గదికి తాళం వేసే ఉంటోంది. ఇక్కడ డాక్టర్ రిటైర్ అయ్యారని కొత్త డాక్టర్ రాలేదని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మండల కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలందడం కలగానే మిగులుతోంది. దీంతో పేదలు చిరకాలంగా వైద్యం కోసం వ్యవయ ప్రయాసలకు గురి అవుతూనే ఉన్నారు.

కు.ని. ఆపరేషన్లు లేక..

గాదెవారిపల్లెలో ఆరేళ్ల నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదు. కారెంపూడిలో కూడా ఆరు నెలలుగా నిలిచిపోయాయి. ఆపరేషన్ థియేటర్, జనరేటర్లు ఇతర అన్ని సౌకర్యాలు నాడు- నేడు కింద సమకూరాయి. అయినా ప్రస్తుతం ఇక్కడున్న డాక్టర్లు నలుగురు జూనియర్లు కావడం వలన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ట్రైనింగ్ వారు తీసుకోకపోవడం వలన ఆపరేషన్లు జరగడం లేదని తెలుస్తోంది. దీంతో ఆపరేషన్ కోసం వచ్చిన వారిని మాచర్ల, గురజాల, నరసరావుపేటలకు తరలిస్తున్నారు. చాలా రోజులుగా ఇది జరుగుతోంది. దీంతో దగ్గరలో వైద్యం అందక వారు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. గ్రామ ప్రజల ముంగిట్లోనే వైద్య సేవలందించాలనే లక్ష్యం మళ్లీ తిరోగమన బాట పట్టింది. ఇంటి వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలందించిన పరిస్థితి గతంలో కన్పించింది. ఇప్పుడు గతంలో ఉన్న సేవలు కూడా ఇక్కడ దూరం అవుతున్నాయి.



డెప్యూటేషన్‌పై ల్యాబ్ టెక్నీషియన్ వెళ్లడంతో వేచి ఉన్న రోగులు

సమస్య పరిష్కరించాలి

వెంటనే ఇక్కడున్న డాక్టర్లలో ఒకరికైనా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల చేసే శిక్షణ ఇచ్చి సమస్యను పరిష్కరించాల్సిన ఆవశ్యకత కన్పిస్తోంది. లేకుంటే సీనియర్ డాక్టర్‌కు ఇక్కడ పోస్టింగ్ ఇవ్వాలి. అలా చేసి కాన్పులు ఇక్కడే జరిగేలా చర్యలు తీసుకోవాలి. అలాగే కు.ని. ఆపరేషన్లు చేయడం కూడా ప్రారంభించాలి. మారుమూల గ్రామాల నుంచి తండాల నుంచి పెద్ద హాస్పిటల్స్‌కు పోలేని పేదలు మాత్రమే ఇక్కడ వస్తారు. అలా పురిటి నొప్పులతో వచ్చిన వారిని అంబులెన్స్‌లో 30 కిలోమీటర్లు దూరం తరలించడమే వారిని బాధిస్తోంది. అప్పుడు కాన్పు అయ్యేవరకు ఏమౌతుందోనని వారంతా టెన్షన్ పడుతున్న పరిస్థితి. వెళ్లే మార్గంలోనే అంబులెన్స్‌లో కాన్పులు అవుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

డాక్టర్ల సేవలు అందుబాటులోకి తేవాలి



కనీసం మండలానికి ఒక ఎండీ డాక్టర్ ఉంటే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. మిగతా నెట్ వర్క్ అంతా యాక్టివ్ అవుతుంది. అన్నీ ఉన్నాయి కాని వృత్యంతర శిక్షణ పొందిన డాక్టర్లు లేరు. ఉదాహరణకు గత 6వ తేదీ కారెంపూడి పీహెచ్‌సీ పరిధిలోని చక్రాయపాలెం గ్రామంలో ఏడాదిన్నర పాపకు డీపీటీ, ఎంఆర్2, పోలియో డ్రాప్స్ వేశారు. పాపకు ఎక్కువ జ్వరం రావడం తర్వాత ఫిట్స్ రావడం జరిగింది. పాపను నరసరావుపేట ప్రైవేటు హాస్పటల్‌కు తరలిస్తే చాలా ఖర్చు అయిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. క్వాలిఫైడ్ డాక్టర్లు లేకపోతే ఇలాంటి అత్యవసర సమస్యలు కష్టం.

– బొంకూరి నాగేశ్వరరావు, కారెంపూడి గ్రామస్తుడు

సిబ్బంది సమస్య పాక్షికంగా ఉంది

గాదెవారిపల్లె పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. కారెంపూడి నుంచి అక్కడకు డెప్యూటేషన్‌పై వెళ్లినప్పుడు ఇక్కడ రోగులు ఆ రెండు రోజులు ఇబ్బందులు పడ్డారు. షుగర్ టెస్టులకు వస్తుంటారు. అలాగే వైరల్ ఫీవర్స్ తరచూ వస్తున్న నేపథ్యంలో ల్యాబ్ టెక్నీషియన్ సేవలు అత్యవసరం. రోజుకు 50 నుంచి 60 పరీక్షలు జరుగుతున్నాయి. అలాగే కారెంపూడి, గాదెవారిపల్లె పీహెచ్‌సీలలో హెల్త్ సూపర్ వైజర్లు ఇద్దరు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో డాక్టర్ సతీష్ డెప్యూటేషన్‌పై వచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. ఇప్పుడు 6 నెలలుగా జరగడం లేదు.

– కె.మల్లయ్య, పీహెచ్‌సీ సూపర్‌వైజర్, కారెంపూడి పీహెచ్‌సీ

22వ తేదీ నుంచి శరన్నవరాత్రులు

మాచర్ల రూరల్: దసర శరన్నవరాత్రుల మహోత్సవాలను ఈ నెల 22 నుంచి వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రారంభించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు భవనాశి వెంకటేశ్వర్లు, సన్నిధి హనుమంతరావు, జక్కా హరికృష్ణ తెలిపారు. శనివారం ఈ మేరకు అమ్మవారి దేవాలయంలో ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. పాత మాచర్లలోని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 22న బాల త్రిపుర సుందరీ దేవి, 23న గాయత్రీదేవి, 24న కాళరాత్రిదేవి, 25న వన దుర్గాదేవి, 26న సంతానలక్ష్మీదేవి, 27న ధనలక్ష్మీదేవి, 28న శైల పుత్రి దేవి, 29న సరస్వతి దేవి, 30న మహాకాళిదేవి, అక్టోబర్ ఒకటిని మహిషాసురమర్దిని దేవి, 2న పుష్పశయ్య అలంకరణలతో అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు అర్చకులు శ్రీనివాసశర్మ, దత్తు, రాఘవశర్మలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోళ్ళ బాల జనార్దనరావు, మారం సత్యనారాయణ, పి.సత్యనారాయణ, చిన్ని చంద్రం, తుమ్మేపల్లి అంకారావు, జాయింట్ సెక్రెటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావు, భవనాశి రవితేజ, కొత్తమాసు చెన్నకేశవరావు, విజయలక్ష్మి, పరిటాల ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, కొత్త శ్రీదేవి, మేడా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తింపు లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోటా సాయికుమార్




విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో గుర్తింపు లేని కేంబ్రిడ్జి ఇంటర్నేషనల్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోటా సాయి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలాంటి అనుమతి లేకుండా నర్సరీ నుంచి తొమ్మిది తరగతి వరకు కేంబ్రిడ్జి పాఠశాల వారు, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా జానపాడు రోడ్‌లోని వాసవీ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఇతర షాపుల మధ్యలో పాఠశాలను నిర్వహించటమేమిటని ప్రశ్నించారు. ఇంటర్నేషనల్ పాఠశాల పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తం పిండి మరి వసూలు చేస్తున్నారని, సరైన ఉపాధ్యాయులు కూడా లేకుండా కేవలం ఇద్దరు టీచర్లతో పాఠశాలను నడుపుతున్నటువంటి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా పాఠశాల నడుపుతున్న బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా కాంప్లెక్స్‌లో విద్యార్థులకు హాస్టల్ పేరుతో తల్లిదండ్రుల దగ్గర నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు



రామనాథశర్మను సన్మానిస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: రాష్ట్రంలో మూడున్నర లక్షల పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించాల్సిన పీఆర్సీ కమిషన్, ఐఆర్, కరువుభత్యం వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా ఇంత వరకు పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయకపోవట దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ వేసి పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకొని కేవలం పెన్షన్ పైనే ఆధారపడే ఉద్యోగులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా పెన్షనర్ గౌరవ సలహాదారు చంద్రమౌళి రామనాథశర్మ 80వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు అందించారు. సమావేశానికి వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చంద్రయ్య, గాలీబ్ సాహెబ్, గౌస్, అంజయ్య, రామారావు, నారాయణ, జాన్‌సాహెబ్, మాబు, పాపిరెడ్డి, నాగేశ్వరరావు, కిరీటిరెడ్డి, భాస్కర్‌బాబు, కృష్ణకుమారి, సుజాత, నాగార్జునరాజు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మాన సభలో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు

రెంటచింతల: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన అమలబాబు, సౌజన్య, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం స్థానిక శివాలయం కల్యాణమండపంలో ఘనంగా సన్మానించారు. ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం కేంద్ర ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్‌బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు కలిసి ఐక్యంగా ఉద్యమించినప్పుడే రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదు ర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయడానికి సమష్టిగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పుడే పరిష్కారమవుతాయ న్నారు. పెరిగిపోతున్న యాప్‌లు వలన ఉపాధ్యాయులందరూ ఎక్కువ సమయం విద్యా భోదనపై దృష్టి పెట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు బేబిరాణి, రామిరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాజశేఖర్, చంద్రజిత్, వెంకట కోటయ్య, గంగాధర్, సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

దాచేపల్లి: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నగర పంచాయతీలోని మనుషర్లా పేటకు చెందిన వంగర సుకుమార్(20) కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. పనులు చేసుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో సుకుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి తాత ఇన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

వివాహిత అదృశ్యం

పెదకూరపాడు: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పెదకూరపాడు ఎస్సై గిరిబాబు శనివారం తెలిపారు. మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 7వ తేదీ రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రపోతానని చెప్పింది. తర్వాత నుంచి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భవన నిర్మాణ కార్మికులను విస్మరించిన కూటమి ప్రభుత్వం

- సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్
- 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి సంఘం పిలుపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

నరసరావుపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంఘ జిల్లా కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హక్కులు సాధనకు ఈనెల 15న విజయవాడ సీతారాంనగర్‌లోని రాష్ట్ర లేబర్ కమీషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో భవన-ఇతర నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం 15 నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అన్ని రాష్ట్రాలలో వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, మన రాష్ట్రంలో అందుకు భిన్నంగా పరిస్థితి ఉందన్నారు. కార్మికులకు ప్రమాదాలు జరిగినా ఆదుకునే పరిస్థితి లేదన్నారు. పిల్లల స్కాలర్‌షిప్, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, ఇన్సూరెన్స్ చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక, హర్యానా రాష్ట్రాలలో వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, తమిళనాడులో మూడు నెలల నుంచి ప్రమాదవశాత్తు చనిపోయిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇస్తున్నారన్నారు. సంక్షేమ బోర్డు నుంచి తప్ప ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఆర్థిక భారం లేని సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.ప్రసాదరావు, అధ్యక్షులు కె.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కె.సురేష్, ఆంజనేయులు, కొండలరావు, కోశాధికారి ఏ.ఆంజనేయులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌కు భారీ స్పందన



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి



జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్

గురజాల: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ ఆదాలత్‌లో 199 కేసులు పరిష్కరించినట్లు 10వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు తెలిపారు. స్థానిక కోర్టు భవనాలలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌ను పర్చువల్ ద్వారా ఇన్‌చార్జి 10వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు మొత్తం 199 కేసులు పరిష్కరించారు. వాటిలో 29 సివిల్ కేసులు, 156 క్రిమినల్ కేసులు, 13 మనోవర్తి కేసులు 26 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, కలివెల ప్రభుదాసు, కర్రా చిన కోటేశ్వరరావు, ఆచంట శ్రీనివాసరావు, చల్లా రామిరెడ్డి పాల్గొన్నారు.

మాచర్లలో 226 కేసులు పరిష్కారం

మాచర్ల రూరల్: మండల న్యాయ సేవా కమిటీ నేతృత్వంలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ నేతృత్వంలో 226 కేసులను పరిష్కరించారు. క్రిమినల్ కేసులు 47, ఎన్ఐ యాక్టు కేసులు 9, భరణం 4, ఎక్సైజ్ 20, ఈపి 22, సివిల్ దావాలు 9, ఎస్‌టియు 11, పిఎల్‌సి 2, ఇతర కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. రాజీ మార్గమే రాజ మార్గమని, కక్షిదారులు భావించి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జడ్జి కోరారు. కార్యక్రమంలో పీడీఎం న్యాయవాది వి.ఏడుకొండలు, ఏజీపీ గంగుల శ్రీనివాసరావు, మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు.